# జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి

## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆవేదన

బాలానగర్, డిసెంబర్ 15 : జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఓ బాలుడి నిండు ప్రాణం బలైందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఫతేనగర్ డివిజన్, ఇందిరాగాంధీపురంలో నాలాలో పడి మృతి చెందిన బాలుడి కుటుంబాన్ని స్థానిక కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్‌తో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇందిరాగాంధీపురంలో కూల్చివేసిన నాలా గోడను కట్టకుండా వదిలివేయడంతో ఆడుకుంటూ మోజామిల్ (8) అనే బాలుడు నాలాలో పడి మృతి చెంది హెస్సేన్‌సాగర్‌లో మృత దేహం లభ్యం కావడం బాధాకరం అన్నారు. బాలుడి మృతి తల్లిదండ్రులకు తీరని లోటు అని అన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారుల పనితీరు వల్ల ఇంకా ఎంతమంది ఇబ్బందులు పడాల్సి వస్తుందోనన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫోన్ చేసినా స్పందించకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల పనితీరు పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు సకాలంలో స్పందించి నాలాగోడ నిర్మించి ఉంటే ఈ ప్రమాదం జరిగేదా అని ఆయన ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి జీహెచ్‌ఎంసీ అధికారులు బాధ్యత వహించి నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.



నాలాలో పడి మృతి చెందిన బాలుడి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

యాదాద్రి లక్ష్మీ నర్సింహ స్వామిని ఆదివారం దర్శించుకున్న వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవిరంగారావు, కుటుంబ సభ్యులు – మియాపూర్, డిసెంబర్ 15

## నేడు జోన్ ఆఫీస్‌లో ప్రజావాణి

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 15 : కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జోనల్ కార్యాలయం అధికారులు తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కొనసాగుతుందన్నారు. మూసాపేటలోని జోన్ ప్రధాన కార్యాలయంతో పాటుగా... కూకట్‌పల్లి, మూసాపేట, కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్ సర్కిళ్ల కార్యాలయంలో ప్రజావాణి ఉంటుందని, డీసీలతో పాటు ఆయా విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆయా సర్కిళ్ల పరిధిలోని ప్రజా సమస్యలను ప్రజావాణిలో అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించడం జరుగుతుందన్నారు.

## ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నేత కొమిరిశెట్టి

హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్‌రెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసిన శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, తదితరులు – శేరిలింగంపల్లి, డిసెంబర్ 15

## నరకయాతన..

ఎన్టీఆర్ మార్గ్‌లో నిత్యం ట్రాఫిక్ రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రోడ్డు దాటేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రోడ్డు దాటేందుకు గాను ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. అయితే ఇటీవల ఆ ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై మెట్లకు అడ్డంగా ఇనుప కంచెలను వేశారు. దీంతో పాదచారులు గత్యంతరం లేక అవస్థలు పడుకుంటూ రోడ్డు దాటుతున్నారు. రోడ్డు దాటే క్రమంలో ప్రమాదం జరిగితే ఎవరూ బాధ్యులని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. –ఖైరతాబాద్, డిసెంబర్ 15

## ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ల బృందం

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 15: ప్రస్తుత యాంత్రిక జీవనంలో ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యాలపై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని ఆపద్బాంధవ సేవా సమితి అధ్యక్షుడు కె.రవీందర్‌గౌడ్ అన్నారు. కాటేదాన్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ల బృందం ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులను పంపిణీ చేశారు. అనంతరం సేవా సమితి అధ్యక్షుడు కె.రవీందర్ గౌడ్ మాట్లాడుతూ ఆపద్బాంధవ సేవా సమితి ఆధ్వర్యంలో పేద ప్రజల కోసం అనేక కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఎప్పటికప్పుడు మురికి వాడలను గుర్తించి ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వారికి మందులను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సంతోష్‌కుమార్, కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆరీఫ్, ఆర్థోపెడిక్ డాక్టర్ అబ్దుల్ జీహాన్, గైనకాలజిస్ట్ డాక్టర్ వెన్నల, సేవా సమితి జాయింట్ సెక్రటరీ బాలిరామ్ పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : ఎమ్మెల్యే బండారి

కాప్రా, డిసెంబర్ 15 : యోగాతో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం సైనిక్‌పురిలోని పార్కులో భారతీయ యోగా సంస్థాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. యోగాతో ఆరోగ్యం మెరుగు పడుతుందని అన్నారు. యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యం కోసం భారతీయ యోగా సంస్థాన్ చేస్తున్న కృషిని ఎమ్మెల్యే అభినందించారు. యోగా శిక్షణకు అనుగుణంగా పార్కులను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ యోగా సంస్థాన్ తెలంగాణ స్టేట్ వెస్ట్ అధ్యక్షుడు ఆర్.ఆర్. యెదు కృష్ణ, సెక్రటరీ రాంజీ, యోగా సంస్థాన్ డిస్ట్రిక్ట్ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, జోన్ అధ్యక్షుడు పురుషోత్తం రావు, గోవర్ధన్‌రెడ్డి, కేంద్రం ఇన్‌చార్జి శ్రీధర్, రామతులసి, యాంకర్ జ్యోత్స్న, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసిన నియోజకవర్గ ప్రజలు

## సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 15 : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సత్వర చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం దండముడిలోని తన నివాసం వద్ద కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలపై వినతిపత్రాలను అందించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లైన్లో మాట్లాడి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

- రంగారెడ్డినగర్ డివిజన్, వెంకటరామిరెడ్డి నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ బాసిత్ 2021 నవంబర్ మాసంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందగా విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చర్చించగా బాధిత కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారం మంజూరైంది. దీంతో ఆదివారం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే చేతుల మీదుగా రూ.5లక్షల చెక్కు అందించారు.

## ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ

ఫతేనగర్ డివిజన్, మాధవినగర్‌లో బొడ్డు కోటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప మహాపడి పూజ నిర్వహించారు. అయ్యప్ప స్వాములతోపాటు బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, తదితరులు హాజరై పూజలు చేశారు. – బాలానగర్, డిసెంబర్ 15

## కీసరగుట్టలో భక్తుల సందడి

కీసర, డిసెంబర్ 15: కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం సెలవుదినం, పౌర్ణమి కావడంతో నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీ ఎత్తున స్వామివారి దర్శనానికి విచ్చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. తెల్లవారు జాము నుంచే ఈ ఆలయంలో భక్తులు స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు నేరుగా కాశీవిశ్వేశ్వరాలయం, శ్రీ నాగదేవత, శ్రీ లక్ష్మీనర్సింహస్వామిలను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ తెలిపారు.

## వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం

మియాపూర్ డివిజన్ పరిధిలోని వివేకానంద సేవా సంఘం వృద్ధాశ్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో మెడికవర్ చందానగర్ దవాఖాన సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ అనూష, డాక్టర్ అక్షయ్‌కుమార్, రాములు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన ఆరోగ్యం కోసం సూచనలు చేశారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ చక్కని జీవన శైలిని అలవర్చుకోవాలని , నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, వెంకట్, శ్రీనివాస్, నరేశ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. – మియాపూర్, డిసెంబర్ 15

## అక్రమ వాణిజ్య ఏర్పాటుపై స్థానికుల అభ్యంతరం!

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 15 : కుత్బుల్లాపూర్ డివిజన్, చింతల్ ప్రధాన రహదారిలో ఇటీవల ఓ నిర్మాణదారుడు రెసిడెన్షియల్ కాలనీలో కమర్షియల్ నిర్మాణం చేపట్టి ప్రైవేట్ ఆసుపత్రికి లీజ్‌కు ఇస్తే స్థానికంగా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. చింతల్ బస్టాప్ సమీపంలో నిత్యం వచ్చిపోయే వాహనాలతో పాటు జనాలతో కిక్కిరిసిపోతుందని, దీనికితోడు అక్రమంగా కమర్షియల్ నిర్మాణం చేపడుతుండటంతో స్థానికులు మండిపడుతున్నారు. అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన ఈ భవనాన్ని టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు కూల్చి, సీజ్ చేసినా.. భవన నిర్మాణదారుడు నిర్మాణం చేపట్టి.. ప్రైవేట్ ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు చర్యలు జరుగుతున్నాయి.. ఫైర్ ఇతర విభాగాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్‌లో ఏదైనా ప్రమాదం జరిగితే కారకులెవ్వరని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## వల్లభాయ్ పటేల్ సేవలు మరువలేనివి

రామంతాపూర్, డిసెంబర్ 15 : సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని రామంతాపూర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన రహదారిలో ఉన్న పటేల్ విగ్రహానికి కార్పొరేటర్లు కక్కిరేణి చేతన హరీశ్, బండారు శ్రీవాణి వెంకట్‌రావు పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిజాం మెడలు వంచిన ధీశాలి వల్లభాయ్ పటేల్ అన్నారు. 530 సంస్థానాలను దేశంలో విలీనం చేసిన ఉక్కుమనిషి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లాచారి,ప్రవీణ్,రఘుపతిగౌడ్,ముత్తినేని జగదీశ్,రేవు నర్సింహ,కుమారస్వామి,దయానంద్‌రెడ్డి, హనుమంతారావు పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో వల్లభాయ్ పటేల్ విగ్రహానికి నివాళులర్పించిన కార్పొరేటర్లు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్‌లో ఉన్న అర్చన కాలనీలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో ఏర్పాటు చేసిన పటేల్ విగ్రహానికి నాయకులు పూల మాల వేసి, నివాళులర్పించారు. ఆయన జాతికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ రూరల్ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, నాయకులు, కాలనీ వాసులు కొండం ఆంజనేయులు ముదిరాజ్, జనార్దన్ రెడ్డి, సుధాకర్ చారి, బుచ్చి రాములు, ప్రభాకర్ రెడ్డి, కిషన్ రావు, ప్రేమ్‌కుమార్, హరి బాబు రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ఇంద్రా రెడ్డి, రాజు, రామచంద్రారెడ్డి, హనుమంత్ రెడ్డి, గంగయ్య, మన్మథరావు, కమలాకర్ రెడ్డి, మోహన్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నేటినుంచి.. ధనుర్మాస ఉత్సవాలు

### ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి

బంజారాహిల్స్,డిసెంబర్ 16: నెల రోజుల పాటు కొనసాగే ధనుర్మాస ఉత్సవాలకు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లోని వైష్ణవ ఆలయాలు సిద్ధమయ్యాయి. నెలరోజుల పాటు శ్రీ రంగనాథ స్వామి కృప కోసం గోదాదేవి అమ్మవారు వ్రతం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించే ధనుర్మాస ఉత్సవాల కోసం ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా డిసెంబర్ 16 నుంచి జనవరి 14 వరకు విశేష పూజలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం 5 గంటలకు ఆరాధన, 5:30కి తిరుప్పావై,సేవా కాలం, అర్చన, తీర్థప్రసాద గోష్టి తదితర పూజలు నిర్వహించనున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, ఫిలింనగర్ దైవసన్నిధానం, జూబ్లీహిల్స్‌లోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం తదితర ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

## బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 15: ఘట్‌కేసర్ పట్టణంలో పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఆర్యవైశ్య సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు బూరుగు చంద్రశేఖర్‌గుప్తా, జిల్లా నాయకులు రవ్వ శరత్‌గుప్తా తెలిపారు. ఘట్‌కేసర్ పట్టణంలో జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు మమత, మండల మహిళా అధ్యక్షురాలు మేఘమాల, కోశాధికారి రవ్వ నవనీత, బిందు పాల్గొన్నారు. బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, రైతు సేవా సహకార సంఘం మండల చైర్మన్ రాంరెడ్డి, మాజీ చైర్మన్ సార శ్రీనివాస్‌గౌడ్, డైరెక్టర్ రేసు లక్ష్మా రెడ్డి, కౌన్సిలర్ బండారి ఆంజనేయులుగౌడ్, మాజీ ఎంపీటీసీ నర్సింగ్‌రావు, గోపాల్‌రెడ్డి, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ మారయ్య, న్యాయవాది చంద్రశేఖర్‌గౌడ్, నాగేశ్ సంఘీభావం తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ

సెమిక్రిస్మస్ వేడుకల్లో భాగంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న శంభీపూర్ కృష్ణ , తదితరులు

దుండిగల్, డిసెంబర్15 : సీఎం సహాయనిధి పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. ఆదివారం శంభీపూర్‌లోని తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మంజూరు చేయించిన రూ.6,28,700ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను 18 మంది లబ్ధిదారులకు శంభీపూర్ కృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉండి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ యూత్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌గౌడ్, నాయకులు మేడి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు శంభీపూర్‌కృష్ణను కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.

**సెమిక్రిస్మస్ వేడుకల్లో కృష్ణ...**

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, చర్చిగాగిల్లాపూర్,చైతన్యకాలనీలోని పెంతుకొస్తు చర్చి, పార్కు సెంట్రల్‌లో జరిగిన సెమిక్రిస్మస్ వేడుకలకు కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రైస్థవులతో కలిసి ప్రత్యేకప్రార్థనలు నిర్వహించిన ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానికంగా ఉన్న పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. చర్చి పాస్టర్, క్రైస్థవులు పాల్గొన్నారు.

## తిరుగీతికలు ఆడియో, వీడియో ..

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 15 : సరస్వతీ పుత్ర కళాపీఠం, శ్రీరాగా క్రియేషన్స్ సంయుక్తాధ్వర్యంలో రచయిత్రి డాక్టర్ పుట్టపర్తి నాగపద్మిని రచించిన తిరుగీతికలు ఆడియో, వీడియో ఆవిష్కరణ కార్యక్రమం నఫీజ్‌రెసిడెన్సీలోని రమణాచారి కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ.. విఖ్యాత వాగ్గేయకారుడు పుట్టపర్తి నారాయణాచార్యుల కూతురు నాగపద్మిని గోదాదేవి తమిళంలో రచించిన 30పాటలను తెలుగులోకి అనువదించారని ప్రశంసించారు. సంగీతదర్శకురాలు వంశీప్రియాధర్మరాజ్ ఎంతో శ్రమపడి రాగాలను సమకూర్చి గాయనీగాయకులతో కలిసి శ్రావ్యంగా గానం చేశారని అభినందించారు. ప్రవచనకర్త డాక్టర్ అనంతలక్ష్మి, లేళ్ళపల్లి రమేశ్, శ్రీదేవి, చంద్రశేఖర్‌భరద్వాజ్ పాల్గొన్నారు.



తిరుగీతికలు ఆడియో, వీడియోను ఆవిష్కరిస్తున్న రమణాచారి, అనంతలక్ష్మి తదితరులు

## మధ్యే మార్గం రాజీతో...

- లోక్ అదాలత్‌తో 824 కేసుల పరిష్కారం
- వెస్ట్‌జోన్ పరిధిలో పంజాగుట్ట టాప్
- రెండో స్థానంలో బంజారాహిల్స్ పీఎస్

బంజారాహిల్స్,డిసెంబర్ 16: పెండింగ్ కేసుల పరిష్కారం కోసం నిర్వహించిన లోక్ అదాలత్‌లో భాగంగా వెస్ట్‌జోన్ పరిధిలోని ఎనిమిది పోలీస్‌స్టేషన్లలో నమోదైన 824 కేసులు పరిష్కారమయ్యాయి.

- వెస్ట్‌జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఎస్ఆర్‌నగర్, మధురానగర్, బోరబండ, మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎఫ్ఐఆర్ నమోదైన కేసుల్లో 386 యూఐ కేసులు, 438 పీటీ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించారు.
- అత్యధికంగా 155 కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించిన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ మొదటి స్థానంలో నిలిచింది. ● బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ 152 కేసులతో రెండో స్థానంలో నిలిచింది.
- జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ 132 కేసులతో మూడోస్థానం దక్కించుకుంది. గొడవలు, చిన్నచిన్న రోడ్డు ప్రమాదాలు, బెదిరింపులు తదితర కేసులను ఫిర్యాదుదారులు, నిందితుల మధ్య రాజీ ద్వారా పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌లో అవకాశం కల్పించారు. దీంతో తమ పోలీస్‌స్టేషన్ల పరిధిలో లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే కేసులకు సంబంధించిన వివరాలను సేకరించిన పోలీసులు 15రోజులుగా శ్రమించి ఫిర్యాదుదారులను సంప్రదించడంతో పాటు కేసుల్లో రాజీకి గల అవకాశాలను వివరించారు. దీంతో పాటు కొన్ని కేసుల్లో నిందితుడు తన నేరాన్ని అంగీకరించడంతో జరిమానా వేయడం ద్వారా కేసును ముగించారు.
- లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసుల సంఖ్య తగ్గడంతో పాటు కేసు పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసేందుకు అవకాశం ఉంటుందని వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ తెలిపారు.

## కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 15 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి.

టమాట కేజీ రూ.15, వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 25, బజ్జి మిర్చి 20, కాకరకాయ 31, బీరకాయ 55, క్యాబేజి 19, ఫ్రెంచ్ బీన్స్ 50, క్యారెట్ 37, కాలీ ఫ్లవర్ 30, దొండ 40, చిక్కుడు 40, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 35, క్యాప్సికం 55, ఆలుగడ్డ 33, కీరా 32, దోసకాయ 16, సొరకాయ 20, పొట్లకాయ (1) 22, కందగడ్డ 55, ఉల్లిపొరక 40, ఉల్లిగడ్డ 49, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 35, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడికాయ 40, నిమ్మకాయలు(12) 30 నుంచి 40, మునగకాయ(1) 18 నుంచి 20, పచ్చి బఠానీ 75, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 160, వెల్లుల్లి 400, చింతపండు 140, కరివేపాకు 100గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

## ఉప్పర్‌పల్లి ఆర్‌కే గోదాంలో అగ్ని ప్రమాదం

శామీర్‌పేట, డిసెంబర్ 15 : ఉప్పర్‌పల్లి ఆర్‌కే గోదాంలో అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తూంకుంట మున్సిపాలిటీలోని ఉప్పర్‌పల్లిలో డెకరేషన్ ఆర్‌కే గోదాములు నిర్వహిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ప్రమాద శాత్తు లేబర్ రూమ్ సమీపంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో గోదాములో మంటలు చెలరేగాయి. విషయాన్ని గమనించిన కూలీలు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా అప్పటికే మంటలు ఎగసిపడడంతో శామీర్‌పేట పోలీస్, ఫైర్ స్టేషన్‌ను సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్, ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. రూ.4 లక్షల మేరకు ఆస్తినష్టం జరిగినట్లు సూపర్ వైజర్ విశాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.